శిథిలావస్థలో షా గులాబ్‌చంద్ గ్రంథాలయం

దశాబ్దాల కాలంగా పాఠకులు, నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తున్న షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయం ప్రస్తుతం సమస్యలతో కునారిల్లుతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ గ్రంథాలయం గురించి పట్టించుకునే నాథుడే లేడు. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు ఆందోళన చెందుతున్నారు.

- పెచ్చులూడుతున్న భవనం
- భయాందోళనలో పాఠకులు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయం

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో పాఠకులు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఈ గ్రంథాలయం పట్టణ వాసులకే కాకుండా పరిసర ప్రాంత వాసులకు దశాబ్దాల కాలంగా విజ్ఞానాన్ని అందిస్తోంది. 1996 సెప్టెంబర్ 7వ తేదీన గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ గ్రంథాలయం పాఠకుల్లో జ్ఞాన జ్యోతులను వెలిగిస్తోంది. భవనం నిర్మించి దాదాపు 30 ఏళ్లు అవుతుండటంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. ప్రధాన భవనం పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. భవనం పైన పిచ్చి మొక్కలు మొలిచాయి. నిత్యం వందల సంఖ్యలో పాఠకులు గ్రంథాలయానికి వస్తూంటారు. భవనం శిథిలమై పెచ్చులూడి పడటంతో పాఠకులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తుతున్నారు. ఫ్లోరింగ్ సైతం పూర్తిగా శిథిలమైంది. గోడలు బీటలు వారి రేపోమాపో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరుగుదొడ్ల పరిశుభ్రత లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. తాగునీటి వసతి లేదు. ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూసే నిరుద్యోగులు గ్రంథాలయానికి నిత్యం వస్తుంటారు. నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలు, మెటీరియల్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు...

గ్రంథాలయ భవనం సమస్యలతో సతమతమవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించాలని పట్టణ వాసులు, పాఠకులు ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు గ్రంథాలయంలో సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని పాఠకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


గ్రంథాలయంలో శిథిలమైన ఫ్లోరింగ్


పెచ్చులూడి పడుతున్న భవనం పైకప్పు

భయమేస్తోంది



ఉద్యోగావకాశాల నిమిత్తం ప్రతిరోజు గ్రంథాలయానికి చదువుకోవడానికి వెళ్తాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలోనే ఉంటా. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి పైనుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఏ పెచ్చు ఎప్పుడు ఊడి మీద పడుతుందోనని భయం భయంగా చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫ్లోరింగ్ పై నడిచి కాళ్లకు గాయాలవుతున్నాయి.

–వి.రాజేష్, పాఠకుడు

పుస్తకాలూ కరువే...



జిల్లాలోనే పేరొందిన గ్రంథాలయం అయినా పైన పటారం లోన లొటారంలా ఉంది షా గులాబ్ చంద్ గ్రంథాలయ పరిస్థితి. పాతకాలం నాటి పుస్తకాలు తప్ప నేటి యువతకు అవసరమయ్యే పుస్తకాలు గ్రంథాలయంలో లేవు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే పుస్తకాలు కావాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. పేరుకే గ్రంథాలయంగా ఉంది. విజ్ఞానం మాత్రం శూన్యం.

–ఫణి, నిరుద్యోగి గుడివాడ

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ



గుడివాడ టౌన్: సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలో తమ విద్యార్థి బంగారు పతకం సాధించడంతో పాటు స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ సౌత్ ఇండియా టైటిల్ గెలుచుకున్నారని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర బాబు తెలిపారు. బంగారు పతకం సాధించిన పెద్ది జాన్‌బాబును గురువారం కళాశాల ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 25 వరకు సేలంలో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ విద్యార్థి 74 కిలోల శరీర బరువు విభాగంలో 617 కిలోల బరువును ఎత్తి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. జాన్‌బాబును సంస్థ చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణారెడ్డి, డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ముడా చైర్మన్ ప్రసాద్‌కు సన్మానం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌కు సన్మానం చేశారు. గురువారం ఆయన మచిలీపట్నంలో గురువారం ముడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారానికి వెళుతున్న మట్టా ప్రసాద్‌ను గుడ్లవల్లేరులో బీజేపీ నాయకులు పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ గుడివాడ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్ కుమార్, వైపీసీ ప్రసాద్, లయన్స్ చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ, గుడ్లవల్లేరు మాజీ సర్పంచులు చాపరాల బాలాజీ, పల్లెం నరసింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మట్టా ప్రసాద్ గుడ్లవల్లేరు నుంచి ర్యాలీగా మచిలీపట్నంకు తరలివెళ్లారు.

ఘనంగా సాయినాథునికి పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో కార్తిక మాసం చివరి గురువారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనటంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలుత ఆలయంలో బాబా వారికి కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆవుపాలతో, పంచామృతాలతో, నవరసాలతో విశేషంగా బాబాకి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శతనామ అష్టోత్తరాలతో పూజలు చేసి పలు రకాల పువ్వులతో బాబాని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మధ్యాహ్న హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పావులూరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వినోద్ తెలిపారు. కార్యక్రమంలో షిర్డిసాయి భక్త మండలి సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మధుసూదనరావు, మల్లికార్జునరావు, సాయి, రాధాకృష్ణ, సురేష్, అప్పయ్య పాల్గొన్నారు.

62 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు

కైకలూరు: మండలంలోని రాచపట్నంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధిశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 పశువులకు పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించుకుని పెయ్యదూడలను పొంది పాడి ఉత్పత్తి పెంచుకోవాలన్నారు. ఒక్కో లింగ నిర్ధారిత వీర్య నాళిక ధర రూ.1350 అన్నారు. ప్రభుత్వ సబ్సిడీ రూ.850 పోగా లబ్ధిదారుడి వాటా రూ.500 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రహర్ష ధన శ్యామ్, రాచపట్నం పశు సంవర్ధక సహాయకులు ఎ.లోకేష్,సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



ముదినేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. కేఎల్ నారాయణ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ట్యాంక్, ఫర్నిచర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మద్దతు ధర పొందండి



ముదినేపల్లి రూరల్: నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సార్వా ధాన్యానికి పూర్తి మద్దతు ధరను పొందాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటరమణి అన్నారు. ముదినేపల్లిలో ధాన్యం పట్టుబడి చేస్తున్న రైతులతో ఏడీఏ గురువారం మాట్లాడారు. యంత్రాల ద్వారా కోతలు కోసిన వెంటనే ధాన్యాన్ని పట్టుబడి చేస్తే తేమ శాతం అధికంగా ఉండి ధర తగ్గుతుందన్నారు. రబీలో సాగు చేసే మినుము పైరుకు సంబంధించి విత్తనాలను తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల పైరు కొన్ని రకాల తెగుళ్లను తట్టుకుంటుందని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కైకలూరు: సమాజంలో బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కైకలూరు సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేక చట్టాలపై స్థానిక కోర్టు ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలకు పాల్పడే వారిపై, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

సబ్ స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

కైకలూరు: ఆటపాక ఎస్‌ఎస్‌ఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఒకేషనల్ సబ్జెక్ట్‌లో భాగంగా గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎన్ని విధాలుగా పవర్ డిస్ట్రిబ్యూట్ అవుతోంది, ఎలా ట్రాన్స్‌ఫర్ అవుతోంది తదితర అంశాలపై ఈఈ వెంకటేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ఒకేషనల్ ఉపాధ్యాయిని నేహా పాల్గొన్నారు.

పెన్షన్లు సజావుగా పంపిణీ చేయాలి

ఎంపీడీవో విష్ణుప్రసాద్


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

గుడివాడరూరల్: డిసెంబర్ 1వ తేదీన ఆదివారం కావడం వలన ఈనెల 30వ తేదీనే పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారులకు ఇవ్వాల్సిన నగదును 29వ తేదీకే ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందికి అందిస్తారన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మినుము విత్తనాలు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్


మినుము విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

పామర్రు: ''మినుము విత్తనాలు ఇవ్వరా;? సమయం దాటుతోంది'' అనే శీర్షికతో ఈనెల 27వ తేదీన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందన లభించింది. వ్యవసాయశాఖ అధికారులు గురువారం రైతులకు మినుము విత్తనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శివనాగరాణి మాట్లాడుతూ మినుము విత్తనాల ఖరీదు కేజీ రూ.140 కాగా, సబ్సిడీ రూ.42 పోను రూ.98కే విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న విశాఖపట్నంకు చెందిన దైవ వర్తమానికురాలు సిస్టర్ ఎ రోఫియా

పామర్రు: క్రైస్తవుల సంక్షేమమే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలని విశాఖ పట్నంకు చెందిన దైవ వర్తమానికురాలు సిస్టర్ ఎ రోఫియా అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో క్రైస్తవ సంక్షేమ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోఫియా పాల్గొని మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. సభకు సాల్మన్ కొల్లాబత్తుల అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి సీ జాన్ మోజెస్, పామర్రు నియోజకవర్గ పాస్టర్లు పాల్గొన్నారు.

జిల్లాలో 2.75లక్షల ఎకరాల్లో మినుము సాగుకు సిద్ధం

జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి


కోత కొచ్చిన వరి చేలో మినుము విత్తనాలు జల్లుతున్న రైతు

గుడ్లవల్లేరు: జిల్లాలో 2.75 లక్షల ఎకరాల్లో మినుము సాగు చేసేందుకు రంగం సిద్ధమైంది. మరో 8,750 ఎకరాల్లో పెసర, కొద్ది ప్రాంతాల్లో శనగ, వరి రకాలను ఈ రబీలో సాగు చేసేందుకు జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. కోత దశకు వచ్చిన వరి చేలల్లో కొందరు రైతులు ఇప్పటికే మినుము, పెసరను చల్లేస్తున్నారు. హార్వెస్టర్లతో వరి కోత కోసిన భూముల్లో ఇప్పటికే మినుము, పెసర పైర్లు సాగవుతున్నాయి. ఈ సాగుకు జిల్లాకు రైతుల అవసరాన్ని బట్టి విత్తనాలు దిగుమతి చేస్తున్నట్లుగా జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.పద్మావతి తెలిపారు. ఆమె ఇస్తున్న వివరాలు ఇలా ఉన్నాయి.

30 శాతం సబ్సిడీ విత్తనాలు

- జిల్లాలో సాగుకు అవసరమైన విత్తనాల్లో ఏపీ సీడ్స్ ద్వారా 30 శాతం మేరకు మాత్రమే విత్తన సరఫరా చేస్తున్నారు.
- జిల్లాలో ఎక్కువగా రైతులు తమ సొంత విత్తనాలనే సాగుకు ఉపయోగించుకుంటున్నారు.
- ప్రస్తుతం రైతులు అడిగే ఇండెంట్‌ను బట్టే సబ్సిడీ విత్తనాల్ని జిల్లాలోని వ్యవసాయాధికారులు, సిబ్బంది సరఫరా చేస్తున్నారు.
- పాసు పుస్తకాలు, ఆధార్ కార్డుల జిరాక్స్‌తో తమ దగ్గరలో ఉన్న స్థానిక ఏఓ కార్యాలయంతో పాటు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు రైతులు వెళ్తే సబ్సిడీ విత్తనాలు లభిస్తాయి.
- కౌలుదారులు తమ కౌలు గుర్తింపు కార్డుల్ని తీసుకొస్తే సబ్సిడీ విత్తనాలు పొందవచ్చు.

విత్తనాల రాయితీలు ఇలా...


జేడీఏ పద్మావతి

మినుముకు సంబంధించి పీయూ 31, ఎల్‌బీజీ - 752, ఐపీయూ 2-43, టీబీజీ - 104, వీబీఎ - 8 రకాల విత్తనాలను కిలో రూ.140 చొప్పున 4 కిలోల బ్యాగ్ ధర రూ.560 ఉంటే...రూ.168 సబ్సిడీతో రూ.392కు రైతు వాటా కింద పంపిణీ చేస్తున్నారు. పెసర ఐపీఎం 2-14, ఐపీఎం 410-3 రకాల విత్తనాలను కిలో రూ.130 చొప్పున 4 కిలోల బ్యాగ్ ధర రూ.520 ఉంటే...రూ.156 సబ్సిడీతో రైతు వాటా రూ.364కు అందిస్తున్నారు. వరి ఎంటీయూ - 1121రకం విత్తనాలను కిలో రూ.39.80 చొప్పున...30కిలోల బ్యాగ్ ధర రూ.1,194 ఉంటే...రూ.150 సబ్సిడీతో రైతు వాటా రూ.1,044కు పంపిణీ చేస్తున్నారు. శనగ జేజీ - 11రకం విత్తనాలను కిలో రూ.94 చొప్పున...20కిలోల బ్యాగ్ ధర రూ.1,880 ఉంటే...రూ.470 సబ్సిడీతో రైతు వాటా రూ.1,410కు రైతులకు పంపిణీ చేస్తున్నారు.

జ్యోతీరావ్ పూలేకు ఘన నివాళి


పామర్రులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు



ముదినేపల్లిలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీనాయకులు


గుడివాడలో పూలే దంపతుల విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

గుడివాడ టౌన్: మహాత్మ జ్యోతీరావ్ పూలే 134వ వర్ధంతి పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ బీసీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల జ్యోతీరావ్ పూలే - సావిత్రీబాయ్ పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజానికి చదువు ఎంత అవసరమో తెలియజేసిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌కే సయ్యద్, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు డి.కృష్ణారావు, నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.ఆదివిష్ణు, సీహెచ్ ప్రభాకర్, జి.ప్రభాకర్, ఎంఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో...

స్థానిక సీపీఎం కార్యాలయంలో జ్యోతీరావ్ పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోగంటి గాంధీబాబు, ఆర్‌సీపీ రెడ్డి, వసుధ బసవేశ్వరరావు, బీవీ శ్రీనివాసరావు, కొమ్ముల సురేష్, అవిర్నేని వెంకటేశ్వరరావు, లంక సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

పామర్రు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డ మహాత్మ జ్యోతిరావ్ పూలే 134వ వర్ధంతి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నేతలు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నత్తా నాని పాల్గొన్నారు.

పూలే సేవలు మరువలేనివి

ముదినేపల్లి రూరల్: సమాజంలో విప్లవాత్మక మార్పులకు కృషి చేసిన జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు అన్నారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న పూలే విగ్రహం వద్ద గురువారం నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షుడు పడమట వెంకటరమణ, పల్లెం పుణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, జన్ను వెంకటేశ్వరరావు, ఈడే శ్రీనివాసరావు, గౌస్‌బేగ్, కారే కోటేశ్వరరావు, సోమల వరప్రసాద్ పాల్గొన్నారు.

అక్షర జ్యోతికి ప్రాణం జ్యోతిరావు పూలే

మండవల్లి: దేశంలో అక్షరజ్యోతికి ప్రాణం పోసి వెలిగించిన జ్ఞానజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ నాయకుడు కొరపాటి శాంతరాజు, సామాజిక కార్యకర్త, గౌరవ అధ్యక్షుడు ఎల్‌ఎస్ భాస్కరరావు, గోరింక గాంధీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మండవల్లి అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ములకలపల్లి సర్పంచ్ మృతి

ముదినేపల్లి రూరల్: మండలంలోని ములకలపల్లి సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు (55) గురువారం మృతి చెందారు. కోటేశ్వరరావు మరణ వార్త తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గ్రామానికి చేరుకుని కోటేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, బత్తిన కిషోర్, శీలం రామకృష్ణ, వాసే జయరాజు, అనిల్, గోరింకల గంగరాజు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొంటాం

రాష్ట్ర మంత్రి నాదెండ్లకు సమస్యల ఏకరవు పెట్టిన రైతులు

గుడ్లవల్లేరు: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రతి గింజను ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుడ్లవల్లేరులో వరి రైతులకు గురువారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 24 శాతం తేమ ఉన్నా...కొనుగోలు చేయాలంటూ అధికారులను ఆదేశించామని చెప్పారు. కేవలం 5 కిలోల తరుగు మాత్రమే తీయమంటున్నామన్నారు. ఈ ఒక్క రోజునే వెయ్యి టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మిల్లర్లు పారదర్శకంగా కొనుగోళ్లు చేయకపోతే సహించేది లేదన్నారు. వ్యవసాయ, పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పని చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎస్‌ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని కృష్ణప్రసాద్, గుడ్లవల్లేరు మాజీ సర్పంచులు చాపరాల బాలాజీ, పల్లెం నరసింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొట్లూరి రవి, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, రైతులు చాపరాల సుధాకర్, పెరుమాళ్లు, యెనిగెళ్ల నాగేశ్వరరావు, మురాల నరేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

గంభీర మౌన ధ్యానం


ధ్యానం చేస్తున్న ధ్యాన ప్రియులు

గుడివాడ టౌన్: స్థానిక శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు గంభీర మౌన ధ్యానం జరిగింది. ధ్యానరత్న పిప్పళ్ల ప్రసాదరావు(భీమవరం) బృందంచే ఆధ్యాత్మిక సంగీతనాద ధ్యానం జరిపారు. భక్తిగీతాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలతో కార్తిక వనసమారాధన ముగిసింది. కార్యక్రమంలో నిర్వాహకురాలు రాజకుమారి బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల సదుపాయాల పరిశీలన

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, యలమర్రు గ్రామాల్లో ఉన్న నీటి సంఘాలకు ఎన్నికల దృష్ట్యా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ వై.రంగారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంట్రప్రగడలో వాటర్ యూజర్ అసోసియేషన్‌లో నంబరు 38లో ఉన్న 12 టీసీకు, యలమర్రులో నంబరు 51లో ఉన్న 12 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికలకు కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.